05ATP30_05ATP30.qxd 30-09-2025 PM 11:34 Page 1



## నూతన పప్పుశనగ విధానంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలంలోని రావివెంకటాంపల్లి యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయ అనంతపురం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ సారు నల్లరేగడి భూముల్లో చిన్న, సన్న కారు రైతులు నూతన పప్పుశనగ విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. పప్పుశనగ మోడల్ నల్ల రేగడి భూముల్లో నాలుగు అడుగులు బెడ్లు తయారు చేసి. ఒక అడుగు కాలవ ఉండే విధంగా తయారు చేసుకోవాలని, బెడ్లు మధ్య ఎత్తుగా ఉండే విధంగా తయారు చేసుకోవాలని, అందులో నాలుగు చుక్కల గొర్రుతో విత్తుకోవాలన్నారు. అధిక వర్షం పడితే కాలువ ద్వారా నీరు బయటికి పోయి పంట నష్టం జరగదన్నారు. అందులో మెరప, టమోట, వంగ, ఆముదము తదితర పంటలు వేసుకోవాలన్నారు. అలాగే పొలం చుట్టూ సద్ద వేసుకోవాలన్నారు. అంతర పంటలు 365 రోజులు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. రావివెంకటాంపల్లి గ్రామంలోని ఒక రైతు పొలం లీజు తీసుకొని ఒక ఎకరంలో మోడల్ వేశారు. ఇతర జిల్లాల నుండి వచ్చిన పప్పుశనగ మోడల్ ట్రైనర్స్‌కు డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధికారులు పవన్, నరేంద్ర. నవీన్, తాడిపత్రి యూనిట్‌లోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రావివెంకటాంపల్లి వ్యవసాయ అధికార సిబ్బంది రెడ్డి రమేష్, రైతులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసరసరుకులు అందచేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

దసరా పండుగను పురస్కరించుకొని ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీమార్కండేయస్వామి దేవాలయం ఆవరణలో 35 మంది నిరుపేదలైన వృద్ధ మహిళలకు ఒక్కొక్కరికి 1350 రూపాయలు విలువగల 24 రకాలైన 47 వేల రూపాయల నిత్యావసరసరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కర్ణాటక బ్యాంక్ మేనేజర్ మంజునాథ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుండి దసరా సందర్భంగా పేదలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ గౌరవాధ్యక్షులు గురప్ప, అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, గౌరవ సలహాదారు శ్రీరంగయ్య, కన్వీనర్ దోగురు శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, కరుణాకర్, పెద్దయ్య, సభ్యులు సుధాకర్, లక్ష్మీనరసయ్య, వీరభాస్కర్, జాఫర్, సూర్యనారాయణరెడ్డి, ఫాజిల్, మహిళా సభ్యులు అరుణశ్రీ, వెంకటలక్ష్మి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## టిబి పేషెంట్లకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**



పౌష్టికాహారం కిట్లను అందచేస్తున్న దృశ్యం

పట్టణంలోని టైలర్స్ కాలనీలో వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టిబి పేషెంట్లకు కౌన్సిలర్ టి.హుస్సేన్‌బాష పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. టిబి ముక్తాభారత్ అభియాన్‌లో భాగంగా నాల్గవ నెల 20 మంది టిబి పేషెంట్లకు పౌష్టికాహారం కిట్లను అందచేశారు. ఈ సందర్భంగా టిబి సూపర్‌వైజర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ టిబి టాబ్లెట్లతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం వలన రోగాన్ని నయం చేసుకోవచ్చన్నారు. ఆరు నెలలు కచ్చితంగా టిబి టాబ్లెట్ వేసుకోవాలని అలాగే ఇంట్లో ఉండే వ్యక్తులకు గల్ల పరీక్ష మరియు సివైటిబి ఇంజక్షన్లు వేయించుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిబిహెచ్‌వి సౌందర్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## జనగణనలో కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య

**పుట్లూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

జనగణనలో కులగణన చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి కులాల ప్రాతిపదికన తెలంగాణ మాదిరిగా స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలన్నారు. జనగణనలో కులగణన చేపట్టాలని బిసి కులాల జనాభా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. అక్టోబర్ 4వ తేదీన అనంతపురం నగరంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా ఐదు నుండి 15 శాతం వున్న అగ్రకులాల నాయకులు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారు కానీ 50 నుండి 70 శాతం మధ్యలో వున్న బిసి కులాల నాయకులు చిన్నచిన్న పోస్టులకు అగ్రకులాల వారిని అడుక్కునే పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులు కోల్పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి వెనుకబడిన కులాల హక్కులను సాధించుకోవడానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కుల సంఘాలను ఆహ్వానించి రౌండ్ టేబుల్ ద్వారా కార్యాచరణ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వంపైన ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. తక్షణమే జనగణనలో కులగణన చేపట్టి స్థానిక సంస్థలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపైన అక్టోబర్ 4వ తేదీన అనంతపురంలో జరిగే సదస్సు ముఖ్యఅతిథిగా సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ హాజరు కావడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శులు రాజు, బాలు, ఓబులపతి, నడిపి నారాయణ, దేవరాజు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి ఆకుపూజలు



**యల్లనూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు స్వామివారికి ఆకుపూజలు చేయించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- ఎస్పీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్**



డిఎస్పీ, సిఐలతో మాట్లాడుతున్న ఎస్పీ

**కదిరి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

విధులలో నిర్లక్ష్యం వహించకుండా ఫిర్యాదు దారులపట్ల అలసత్వంగా వ్యవహరించకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించి నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కదిరి పోలీస్‌సబ్ డివిజన్ పరిధిలోని డిఎస్పీ కార్యాలయం, పట్టణ సిఐ, రూరల్ పోలీస్‌స్టేషన్‌లు, రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులు, మహిళ హెల్ప్ డెస్క్, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డిఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సబ్ డివిజన్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కదిరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో ఆయా ప్రాంతాల్లో నమోదు అవుతున్న కేసులు, శాంతి భద్రతల సమస్యలపై డిఎస్పీతో అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా గట్టి చర్యలు చేపట్టాలని డిఎస్పీకి సూచించారు. అమలు చేయాల్సిన కార్యచరణపై దిశ నిర్దేశం చేశారు. ప్రధానంగా మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేఏయడంతోపాటు విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలన్నారు. ఇంటి యజమానులు, వ్యాపార సముదాయాల వద్ద ప్రతి ఒక్కరు నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని, నిత్యం, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలన్నారు. రాత్రి పూట గ్రామాలను సందర్శించి నైట్ అలర్ట్‌లు చేపట్టి, శక్తి యాప్, బాల్య వివాహాలు, వివిధ సైబర్ నేరాలు, మోసాల తీరును వివరించి సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, జూదం, అక్రమ మద్యం అరికట్టే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. రౌడీ షీటర్‌పై ప్రత్యేక నిఘా పెట్టి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదల కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది విధులు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ఏ మసమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఎస్పీతోపాటు డిఎస్పీ శివనారాయణస్వామి, సిఐలు డివి నారాయణరెడ్డి, నాగేంద్ర, నిరంజన్‌రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిని కూతురు వివాహానికి ఆహ్వానించిన ఎంపీటీసీ గౌస్



తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని కుమార్తె పెళ్లికి ఆహ్వానిస్తున్న ఎంపీటీసీ గౌస్, వైసీపీ నాయకులు.

**అనంతపురం రూరల్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని కుమార్తె వివాహానికి రాచనాపల్లి ఎంపీటీసీ 2 గౌస్,వైఎస్ఆర్సీపి నాయకులతో కలిసి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పెళ్లి పత్రిక అందజేసి అక్టోబర్ 4, 5 తేదీల్లో జరిగే కుమార్తె పెళ్లికిరావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, చేనేత విభాగ అధ్యక్షులు బాలకృష్ణ, వైఎస్ఆర్సిపి నాయకులు రామ్మోహన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా జూటూరు షహరాభా



**యాడికి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

యాడికి మండల కేంద్రానికి చెందిన సామాజికవేత్త, స్టాంప్ రైటర్ జూటూరు రజాక్ సతీమణి షహరాభాను తాడిపత్రి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ఎమ్మెల్యే జె.సి అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మార్కెట్ అధికారులు జూటూరు షహరాభానుకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జూటూరు షహరాభాను తాడిపత్రి మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా నియామకవడంతో పాటు దసరా పండుగను పురస్కరించుకుని యాడికి మండల ప్రజలు, ముస్లిం సోదరులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ షహరాభానుకు దసరా శుభాకాంక్షలు తెలియచేశారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా రామకృష్ణారెడ్డి

**యల్లనూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**



శింగనమల మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా యల్లనూరు మండలం మేడుకుర్తి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించినట్లు టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి శింగనమల మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

## దుర్గాదేవిగా దర్శనమిచ్చిన గాయత్రిమాత

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సంజీవనగర్ జీరోరోడ్డులో వెలసిన శ్రీవేదమాతగాయత్రిదేవి అమ్మవారు మంగళవారం దుర్గాష్టమిని పురస్కరించుకుని శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## విద్యార్థులకు ఆటోమోటివ్ సర్టిఫికెట్లు పంపిణీ




ఇంటర్నల్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ పంపిణీ చేసిన విజయ్ కుమార్

**నల్లచెరువు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న ఆటోమోటివ్ ఇంటర్న్‌షిప్ శిక్షణా పూర్తి అయిన విదార్థులకు మంగళవారం కదిరిలో యమహా షోరూం నందు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జి.సి.డి.వో ఏం.సంపూర్ణ,కదిరి మున్సిపల్ హై స్కూల్ హెడ్ మాస్టర్ కే.శైలజ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చదువుతో పాటు ఆటోమోటివ్ ఇంటర్న్‌షిప్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం విద్యార్థుల భవితకు బరోసా ఇవ్వడమన్నారు.ఈ శిక్షణా కార్యక్రమం వల్ల విద్యార్థులకు చదువు పూర్తి అయిన వెంటనే ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయన్నారు.అనంతరం విదార్థులకు ఆటోమోటివ్ ఇంటర్న్‌షిప్ శిక్షణా అందిస్తున్న ట్రైనర్ కే.సల్మా,డి.లావణ్య, విజయ్ కుమార్,మోలాలి, ఆటోమోటివ్ ఇంటర్న్‌షిప్ శిక్షణకు సహకరించిన యమహా షోరూం సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి వేడుకలు




అమ్మవారిని వేడుకుంటున్న భక్తులు

**ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త**

దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని దుర్గామాత ఆలయాల్లో దుర్గాష్టమి వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు, భక్తులు వేకువజామునే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం, పూలు, పండ్లు సమర్పించి అమ్మవారిని వేడుకున్నారు.

## చౌడమ్మతల్లికి ఒడిబియ్యం

**యల్లనూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**



దసరా ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని పాతపేటలో వెలసిన శ్రీచౌడమ్మతల్లికి కోట వీధికి చెందిన కుప్పా వెంకటరామయ్య కుమార్తె కుప్పా సరస్వతి ఒడిబియ్యం పోశారు. అదేవిధంగా 5 వేల రూపాయల విలువ చేసే హారం సమర్పించి అమ్మవారికి పూజలు జరిపించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుప్పా వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి ఒడి బియ్యం పోసిన దృశ్యం

## మహిషాసురమర్ధినిగా కాళికాదేవి

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**



మహిషాసురమర్ధిని అలంకారంలో కాళికాదేవి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని తాడిపత్రి పట్టణంలోని వడ్ల పాలెంలో వెలసిన శ్రీకాళికాదేవి అమ్మవారు మంగళవారం శ్రీమహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు వీరబ్రహ్మం ఆచార్యులు అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శ్రీమహిషాసురమర్ధినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## అనారోగ్యంతో మృతి చెందిన వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు మృతి

**నల్లచెరువు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**



నివాళులర్పిస్తున్న దృశ్యం

మండలం పరిధిలోని ఓరువాయి పంచాయతీలోని మందాల వాండ్లపల్లి కి చెందిన వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు కలుపూరు వెంకటేష్ నాయుడు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి కదిరి నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయ కర్త మక్బూల్ అహ్మద్ మంగళవారం మృతుని గ్రామానికి వెళ్లి పూలమాలలు వేసి కలుపూరి వెంకటేష్ నాయుడు మృతదేహా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి. తన ప్రగాఢ సంతాపాన్ని.. సానుభూతిని తెలియజేశారు.. సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ తో పాటు నల్లచెరువు మండల ఓరువాయి గ్రామ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, పో రెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్ రెడ్డి, వైస్ కన్వీనర్ రఫీ, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ హైటెక్ రమణ నాయక్, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ ఖాదర్ వలీ, . ఓరువాయి గ్రామ కన్వీనర్ పల్లె వెంకటరెడ్డి, నల్లచెరువు గ్రామ కన్వీనర్ సూర్య శేఖర్ రెడ్డి, నాయకులు ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దసరా సెలవులు పొడిగించాలి

**నంబులపూలకుంట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

ఎపిలో విజయదశమి సెలవులపై విద్యార్థులు, పేరెంట్స్ నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. పండుగ రోజైన అక్టోబర్ 2 వరకు హాలిడేస్ ఇచ్చి 3వ తేది నుంచే తిరిగి క్లాసులు మొదలవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఊర్లకు వెళ్లిన వారు పండుగ రోజు రాత్రికి రాత్రి ఎలా బయల్దేరి వస్తారని పేరెంట్స్ ప్రశ్నిస్తున్నారు. అక్టోబర్ 4 లేదా 5వ తేదికి సెలవులు పొడిగించి అవసరమైతే రెండో శనివారం పని దినంగా ప్రకటించాలని కోరుతున్నారు.

# అక్రమ కేసులకు పరాకాష్ట..!

**- అనవసరంగా ఇబ్బందులకు గురి చేస్తున్న అందరి పేర్లు డిజిటిల్ బుక్‌లో ఎక్కుతున్నాయ్..!**
**- ఇలాంటి కేసుతో ఏమీ కాదు..!**
**- ఆందోళన వద్దు పార్టీ అండగా ఉంటుంది..!**
**- రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన సాయి భార్గవ్ కుటుంబాన్ని పరామర్శించిన తోపుదుర్తి**



సాయి భార్గవ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**రాప్తాడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెడుతున్న అక్రమ కేసులకు పరాకాష్ట బాలకొండ సాయిభార్గవ్ అరెస్ట్ అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. ఏమాత్రం సంబంధం లేని కేసులో రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన బాలగొండ సాయి భార్గవ్ అనే సోషల్ మీడియా కార్యకర్తను ఈనెల 24న గుంటూరు సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. సాయిభార్గవ్‌కు ఈ కేసులో ఎలాంటి సంబంధం లేదంటూ బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదలై ఇంటికొచ్చిన సాయి భార్గవ్ కుటుంబాన్ని గురువారం తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పరామర్శించారు. అక్రమ అరెస్టులకు భయపడొద్దని, ఈ కేసు ఏమీ కాదని వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనవసరంగా ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులందరీ పేర్లు డిజిటల్ బుక్‌లో ఎక్కుతున్నాయని, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరందరూ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. అదే గ్రామంలో పలు వై.యస్.ఆర్.సీపీ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ద్విచక్రవాహనం - అశోక్ లేలాండ్ ఢీ

**- ఒకరు మృతి**

**తనకల్లు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**



ప్రమాదంలో మృతి చెందిన పాతర్లపల్లి శ్రీనివాసులు

మండలంలోని చీకటిమానపల్లి సమీపంలో మంగళవారం ద్విచక్రవాహనం - అశోక్ లేలాండ్ (ట్రక్) వాహనం ఢీ కొన్న సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళుతున్న పాతర్లపల్లి శ్రీనివాసులు (30) అనే వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. శ్రీనివాసులు పాతకోట నుండి సింగిరివాండ్లపల్లికి ఇంటికి వెళ్లే సమయంలో ఎంసి తాండాకు చెందిన ఆదినారాయణనాయక్ అశోక్ లేలాండ్‌లో టమోటాలు వేసుకొని వస్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అశోక లేలాండ్ వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

## ఉద్యోగుల ఉద్యమ బాట.. వైయస్సార్ టియుసి బాసట.. కూటమి మోసపు బాట !

**అనంతపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త బ్యూరో**

కోటి ఆశల దీపంగా తెచ్చుకున్న కూటమి ప్రభుత్వం 17 నెలలలోనే కుదేలైనందున ఉద్యమ బాట తప్పడం లేదని ఉద్యోగ, కార్మికులు అంటున్నారని వైఎస్ఆర్ టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి రమణ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఒకవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు ఒక్కటీ పూర్తిగా నెరవేరలేదంటూ రైతులు, విద్యార్థులు, అంగన్వాడి, ఆశా వర్కర్ల నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. మరోవైపు మా విధులకు సంబంధం లేని సర్వేలు, వాలంటీర్ల పనులు చేయిస్తున్నారని, మమ్ములను శాఖల వారీగా మాతృ శాఖలో విలీనం చేయాలని, బేసిక్ పదోన్నతి కల్పిస్తూ పిఆర్సీ స్లాబ్ వర్తింపజేయాలని, సెలవు రోజులలో బలవంతపు పనులు చేయించకూడదని, రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్ని జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, ప్రొబేషన్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారన్నారు.నగదు రహిత వైద్యం అందించాలని,1999 ఫిబ్రవరి 1 నుండి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, 4 పెండింగ్ డిఏ లను తక్షణం ఇవ్వాలని, ఇంజనీరింగ్ డిగ్రీ ఉన్న సబ్ ఇంజనీర్లకు ఏఈలుగా పదోన్నతి కల్పించాలన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అసలు రంగుపై,ఉద్యోగుల ఉద్యమ సెగలు ఎగిరి పడుతుంటే, కూటమి ప్రభుత్వానికి ఊపిరాడక,ఉక్కిరి బిక్కిరై గుక్క తిప్పుకోలేక గోతికాడ గుంట నక్కలాగా కాచుకు కూర్చున్నదని ఆయన అందులో పేర్కొన్నారు.

## ఆర్టిసి బస్సు లేక ఇబ్బందులు

**నంబులపూలకుంట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

మండల పరిధిలోని సారగుండ్లపల్లి గ్రామం నుంచి పెడబల్లి, ఎన్‌పికుంట మీదుగా కదిరికి ఆర్టిసి బస్సు నడపాలని ఆ ర్పఅంత ప్రజలు కోరుకుంటున్నారు. కొన్ని సంవతసర్రాల క్రితం ఈ ప్రాంతం మీదుగా బస్సును నిరంతరాయంగా నడిపేవారు. ఉదయం 5 గంటలకు సారగుండ్లపల్లిలో బయల్దేరి 7 గంటలకు కదిరికి చేరుకునేది. జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతాలకు వెళ్లే ఆ ప్రాంత ప్రయాణికులకు ఈ బస్సు చాలా అనుకూలంగా ఉండేది. కానీ ఆ బస్సును నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూన్నరు. సర్వీసును పునరుద్దరించాలని కదిరి ఆర్టిసి డిపో మేనేజర్‌కు పలు మార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యమని పెడబల్లి గ్రామానికి చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి బస్సు సర్వీసు మునుపటి సమయంలో నడిచేలా చర్యలు తీసుకుని ప్రజలకు సౌకర్యవంతంగా నడపించాలని వారు కోరారు.

## సిద్ధిధాత్రిదేవిగా దర్శనమిచ్చిన పరమేశ్వరి

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారు మంగళవారం శ్రీసిద్ధిధాత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు అమ్మవారికి కుంకుమార్చనలు, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీసిద్ధిధాత్రిదేవిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

